# నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
● నాచారంలో రూ. 70 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పల్, ఏప్రిల్ 24 : నియోజకవర్గ అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారంలో రూ. 70 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాచారం పాత గ్రామంలో గతంలో రూ. 54 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించామన్నారు. మిగిలిన రోడ్డు నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేయించామన్నారు. ఈ పనులను అదేవిధంగా రవీంద్రనగర్ సాయి బాబా గుడి కమాన్ నుంచి సుమారు 200 మీటర్ల మేర దెబ్బతిన్న రోడ్డు స్థానంలో రూ. 20 లక్షలతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. కాలనీల్లో సంక్షేమ, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.


నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ తదితరులు


జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి

**కార్మికులకు అండగా ఉంటా.. : ఎమ్మెల్యే బండారి**

మల్లాపూర్ డివిజన్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మొదటి వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పనిచేసే నాన్ టీచింగ్ స్టాఫ్‌కు, కార్మికులకు యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన వేతన ఒప్పందం చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, కార్మిక నేతలు రాంబాబు, నారాయణ, డీపీఎస్ స్కూల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మధు గౌడ్, నాయకులు నగేశ్, రాందాస్, అశోక్, రజిత, స్వర్ణలత, నాగమణి పాల్గొన్నారు.

## అర్హులకు 'రాజీవ్ యువ వికాసం' అందించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 24 : అర్హులకు రాజీవ్ యువ వికాసం పథకం అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి, రుణాలు అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు సాంబశివరావు, మోసెస్, ఝాన్సీరాణి. కాంతమ్మ, వినోద్‌కుమార్, శివప్రసాద్, తదితరులున్నారు.

## చలివేంద్రం ప్రారంభం



కాప్రా, ఏప్రిల్ 24 : కాప్రా సర్కిల్ ఈసీఐఎల్ బస్‌స్టేషన్ ఆవరణలో శ్రీ సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ జగన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ సంస్థ ప్రతినిధులు, ఆర్టీసీ డిపో అధికారులు పాల్గొన్నారు.

## కమిషనర్ పర్యటన..

బోడుప్పల్, ఏప్రిల్ 24: బోడుప్పల్ నగర పరిధిలోని పలు డివిజన్లలో గురువారం కమిషనర్ శైలజ పర్యటించారు. వానకాలంలో తలెత్తే ఇబ్బందులను ఎదుర్కొవడానికి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పీఎన్ఆర్ కాలనీ, బీఎల్‌నగర్, ఎస్బీఆర్ కాలనీ, అమ్మసాని వెంకట్‌రెడ్డి నగర్‌లో అధికారులతో కలిసి పర్యటించి ముంపునకు గురయ్యే ప్రాంతాలను, స్థానికులు ఎదుర్కొనే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

మేడ్చల్‌రూరల్, ఏప్రిల్ 24: జమ్మూకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ పలుచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీలు తీశారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి గౌడవల్లిలోని సాకేత్ ప్రణామంలోని సీనియర్ సిటిజన్స్ గురువారం సాయంత్రం నల్లబ్యాడ్జీలతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు వరప్రసాదరావు, అపార్ట్‌మెంట్ మాజీ అధ్యక్షుడు భక్తవత్సలరావు,ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వల్లభేంద్ర రెడ్డి, కోపరేటివ్ సొసైటీ ట్రెజరర్ శేషసాయి, కుమారస్వామి, నిర్మల, చంద్రకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో కొవ్వొత్తుల ర్యాలీ**

మేడ్చల్ కలెక్టరేట్ : పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నాగారం మున్సిపాలిటీలో కొవ్వొత్తుల చేత పట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు.

**కీసరలో..**

కీసర : పహల్గాంలో మతోన్మాద ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాల్పుల్లో మరణించిన వారికి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


మేడ్చల్‌రూరల్ : గౌడవెల్లిలోని సాకేత్ ప్రణామంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్

**సీపీఎం ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం**

ఘట్‌కేసర్ : ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దాడికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం సీనియర్ నాయకుడు చింతల యాదయ్య, మండల కార్యదర్శి సబిత డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. జమ్ము కాశ్మీర్ పహల్గాంలో టూరిస్ట్‌లపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకుడు యాదగిరి, అలివేలు, దాస్, ప్రవీణ్,సుజాత, లలిత, జగన్, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ కలెక్టరేట్ : నాగారం మున్సిపాలిటీలో దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


ఘట్‌కేసర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

# డ్రైనేజీ సమస్యకు త్వరలోనే పరిష్కారం

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


మచ్చ బొల్లారం డివిజన్‌లో డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి ఏప్రిల్ 24: డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే మచ్చ బొల్లారం డివిజన్ ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసులతో కలిసి పర్యటించి డ్రైనేజీ అవుట్‌లెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ పరిష్కారం కోసం అధికారులతో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. నిధులు మంజూరు అనంతరం డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ చలో వరంగల్‌ను జయప్రదం చేయాలి


దేవరయాంజాల్‌లో సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

శామీర్‌పేట, ఏప్రిల్ 24 : వరంగల్ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో గురువారం పార్టీ ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ సభకు తరలివెళ్లెందుకు ప్రతి కార్యకర్త సిద్ధమవ్వాలన్నారు. వార్డుల వారీగా భారీగా తరలి వెళ్లాలని సూచించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు నర్సింగ్‌గౌడ్, యాదమ్మనర్సింగ్ రావు, నర్సింగ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సునీత, రాజ్‌మోహన్, బుచ్చిరెడ్డి, మహేశ్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, సాయిరాకేశ్, కుమార్, సురేశ్, రాహుల్, సంతోషిని, తదితరులు పాల్గొన్నారు.

## వివిధ దేవస్థానాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మేడ్చల్, ఏప్రిల్ 24 : ప్రతి ఆదివారం వివిధ దేవస్థానాలను కలుపుతూ ప్రత్యేక సర్వీసులను నడిపించనున్నట్టు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు సర్వీసులు మేడ్చల్ నుంచి బయల్దేరి బద్రీనాథ్, వర్గల్ సరస్వతీ ఆలయం, కొమురవెల్లి మల్లన్న ఆలయం, ఆలియాబాద్ వేంకటేశ్వర స్వామి, చీర్యాల లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, భువనగిరి స్వర్ణగిరిని చేరుకుని తిరిగి మేడ్చల్‌కు చేరుకుంటాయని తెలిపారు. టికెట్ ధరలు పెద్దలకు రూ. 500, పిల్లలకు రూ.300 ఉం టుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

## నేటి నుంచి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ పరీక్షలను మూడు రోజులపాటు రోజూ మూడు సెషన్లలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్ బేస్ట్‌గా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు కేంద్రాలను హైదరాబాద్ నగరంలోనే ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రానికి పరీక్ష ప్రారంభమయ్యే 90 నిమిషాల ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు తమ వెబ్సైట్‌లో చూసుకోవాలని స్పష్టం చేశారు.

**ఎంఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ మ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎంఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ ఫీజును వచ్చే నెల 2 లోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 5వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

## కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్స్ చట్టాన్ని రద్దు చేయాలి



మల్కాజిగిరిలోని సీపీఎం కార్యాలయంలో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్కాజిగిరి, ఏప్రిల్ 24 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మల్కాజిగిరిలోని సీపీఎం కార్యాలయంలో మే 20న జరుపతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నర్సింగరావు, యాదగిరి, ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు విజయ్ కుమార్, సీపీఎం నాయకుడు కృపాసాగర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలి

మల్కాజిగిరి ఏప్రిల్ 24: హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకుడు సీఎల్ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రజా సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఎల్ యాదగిరి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగే 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని నిర్వాహకులను, ప్రభుత్వాన్ని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. సమాజంలో మహిళలను విలాస వస్తువుగా దిగజార్చే అం దాల పోటీలను బహిష్కరించాలని, మహిళల ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని, భంగపరిచే అందాల పోటీలను రద్దు చేయాలని అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, గద్దర్ అభిమానుల సంఘం, జజ్జనక కళా మండలి, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## అన్నోజిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం



పోచారం,ఏప్రిల్24 : పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ-1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సెక్టార్ స్థాయి పోషణ పక్షం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది తల్లులకు, పిల్లలకు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, తాగునీరు, ఆరోగ్య భద్రత అంశాలను వివరించారు. పిల్లలకు అన్నప్రాసనతో పాటు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులకు సీమంతం జరిపించారు. కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి, సూపరవైజర్ మణెమ్మ, డాక్టర్ శ్రావ్య, షీటీం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, ఆయాలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.


## అవుషాపూర్‌లో వ్యక్తి అదృశ్యం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 24: విల్లాలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి అవుషాపూర్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా ఘనపూర్ మండలం హవేలీ తండాకు చెందిన ముదావత్ లౌక్య(51)కొంతకాలంగా అవుషాపూర్ అంబియన్స్ విల్లాలో వరుసకు సోదరుడు అయ్యే సభవత్ లక్యతో కలిసి పనులు చేస్తున్నాడు. ఈనెల 22న తెల్లవారుజామున 3 గంటలకు లేచి చూసే సరికి లౌక్య కనబడలేదు దీంతో తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లోంచి వెళ్లే సమయంలో నీలం రంగు లుంగీ, పచ్చరంగు తువ్వాలు, బనియన్ ధరించి ఉన్నట్లు తెలిపారు. బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆక్రమణకు పాల్పడిన నలుగురిపై కేసు

పోచారం,ఏప్రిల్ 24 : పోచారం పోలీస్‌స్టేషన్ పరిధి కొర్రెముల గ్రామ పరిధిలో స్థల ఆక్రమణకు పాల్పడిన నలుగురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెముల్ పరిధి సర్వేనంబర్ 751లో కె.రాంచందర్‌రెడ్డితో కలిసి మధుకుమార్ 5,525 గజాలను 2006లో కొనుగోలు చేశారు. అయితే అక్కడ ఉన్న నిర్మాణాలను ముకర్ల మం జుల, ఎరుకల లతాబాయి,బైరు విఘ్నేశ్ గౌడ్, బైరు రాములుగౌడ్ మరికొంత మందితో కలిసి ధ్వంసం చేసినట్లు ఈనెల 22న మధుకుమార్ పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## బొజ్జ యాదగిరికి సత్కారం



ఉప్పల్, ఏప్రిల్ 24 : దళిత జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత బొజ్జ యాదగిరిని గురువారం నాచారం డివిజన్ మున్సిపల్ కార్మిక సంఘాల అధ్యక్షుడు యాక స్వామి, కార్మిక సంఘాల ప్రతినిధులు సత్కరించారు. కార్మికులు పాల్గొన్నారు.

# అధికారులకే సమస్యల పరిష్కార బాధ్యత

● భూభారతి అవగాహన సదస్సులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

కీసర, ఏప్రిల్ 24 : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 'భూభారతి'లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించే హక్కు అధికారులకే కల్పించిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అధికారులు కృషి చేయాలన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి చీర్యాల్ చౌరస్తాలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం భూభారతిపై రైతులు, ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ గౌతమ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కారించుకోవడానికి అప్పీలు చేసుకొనే అధికారం 'భూభారతి'చట్టంలో ఉందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించడానికి సదస్సులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. భూభారతితో రైతులకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. 1970 ఆర్ఓఆర్ చట్టం ప్రకారం భూభారతిలో మార్పులు, చేర్పులను పకడ్బందీగా అమలు చేయనున్నారని పేర్కొన్నారు. సదస్సులో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి, తాసీల్దార్ అశోక్‌కుమార్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్, మండల సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


చీర్యాల్‌లో భూభారతి చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

**ఇకనైనా భూ సమస్యలు పరిష్కారమవుతాయా? అని అధికారులను నిలదీసిన రైతులు**

గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని ఈ భూభారతి చట్టంతోనైనా అవి పరిష్కారమవుతాయా? అని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ ముందే అధికారులను నిలదీశారు. రెవెన్యూ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి చెప్పులు అరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల అండదండలతో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించి సొమ్ము చేసుకున్నారని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అంకిరెడ్డిపల్లి గ్రామ రైతు సింగారం నారాయణ

## వివాదాస్పద నర్సరీ స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 24: ఘట్‌కేసర్ పట్టణంలో కొంతకాలంగా ప్రభుత్వ అధికారులు, ఓ కాంగ్రెస్ నాయకుడి మధ్య వివాదస్పదంగా మారిన నర్సరీ స్థలాన్ని గురువారం హైడ్రా అధికారులు పరిశీలించారు. పట్టణంలోని సర్వే నెంబర్ 127/బీలో 1.39 ఎకరాల భూమిలో మున్సిపల్ నర్సరీ 2021 నుంచి కొనసాగుతున్నది. గత ఏడాది ఫిబ్రవరిలో నర్సరీ స్థలం నాదేనని కాంగ్రెస్ నాయకుడు కందకట్ల మాధవరెడ్డి మున్సిపల్ అధికారులకు విన్నవించుకోగా నర్సరీని మరో పార్కు స్థలంలోకి మార్చారు. మరలా వారం రోజులకే అది ప్రభుత్వ స్థలమేనని సిబ్బంది మళ్లీ యథావిధిగా నర్సరీ ఏర్పాటు చేసి మున్సిపల్ పార్కుగా కొనసాగిస్తున్నారు. అయితే 10 రోజుల కిందట ఆ స్థలం నాదేనంటూ మళ్లీ కాంగ్రెస్ నాయకుడు అతడి పేరు రాసుకున్నాడు. విషయం తెలుసుకున్న అధికారులు అతడి పేరు తొలగించారు కానీ ఏలాంటి చర్యలు తీసుకోలేదు. దాంతో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారంరోజులపాటు ఎవరూ స్పందించకపోవడంతో హైడ్రా అధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

స్పందించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు, తాసీల్దార్ హేమమాలిని వివాదంలో ఉన్న నర్సరీ స్థలాన్ని గురువారం సందర్శించి పరిశీలించారు. అక్కడ ఏర్పడిన ప్రైమ్ ల్యాండ్ లేఅవుట్, సీలింగ్ ల్యాండ్ వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన కాంగ్రెస్ నాయకుడు మాధవరెడ్డి వివరణ తీసుకున్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాగా రూ.20 కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదశ్ ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతోనే హైడ్రాకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుకోవాలన్నారు.


ఘట్‌కేసర్‌లో నర్సరీని సందర్శించి వివరాలు తీసుకుంటున్న హైడ్రా అధికారులు

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



మల్లాపూర్ : మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కృష్ణానగర్‌లోని భారతి విద్యానికేతన్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కరస్పాండెంట్ వనజ సాయి లీల,ఐదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కులు తక్కువగా వచ్చాయని విద్యార్థి ఆత్మహత్య


మల్కాజిగిరి, ఏప్రిల్ 24: మార్కులు తక్కువగా వచ్చాయని ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మచ్చ బొల్లారం మధురానగర్‌లో నివాసం ఉండే ఆనంద్ చారి, సుచరిత దంపతుల కుమారుడు స్నేహిత్(16) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

ఇటీవల ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మనూన్యతకు గురయ్యాడు. బుధవారం సాయంత్రం బాత్రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం స్థానిక దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


## చీర్యాల్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు


లక్ష్మీనర్సింహస్వామి వారిని తీసుకొస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్

కీసర, ఏప్రిల్ 24; చీర్యాల్ శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు వైభ వంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి ఈనెల 27 వరకు ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభోపేతంగా నిర్వహించనున్నారు. మొదటి రోజు చీర్యాల్‌లోని ఆలయ చైర్మన్ లక్ష్మీ నారాయణగౌడ్ ఇంటి నుంచి లక్ష్మీనర్సింహస్వామివారిని బ్యాండ్‌మేళాలతో ఊరేగింపుగా ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.


అలంకరణలో స్వామివారు

## పశువుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలి



ఘట్‌కేసర్, ఏప్రిల్ 24: మండలంలోని ప్రతి రైతు తమ పశువుల ఆరోగ్య పరిరక్షణకు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పద్మిని సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లో గురువారం పశు వైద్య శిబిరంలో భాగంగా గేదెలు, పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దాంతో పాల దిగుబడి తగ్గకుండా, పనులకు ఆటంకం కలగకుండా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.